క్లుప్తంగా

ఇన్‌చార్జి మున్సిపల్ కమిషనర్‌గా రాజయ్య



అలంపూర్ : అలంపూర్ ఇన్‌చార్జి మున్సిపల్ కమిషనర్‌గా ఎస్ రాజయ్య బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ప్రస్తుతం స్థానిక తహసీల్దార్ మంజుల ఇన్‌చార్జి కమిషనర్‌గా విధులు నిర్వహించారు. ఆమె స్థానంలో రాజయ్య ఇన్‌చార్జి కమిషనర్‌గా కొనసాగనున్నారు. గతంలో కమిషనర్‌గా విధులు నిర్వహించిన సరస్వతి బడంగ్‌పేట మున్సిపల్ కమిషనర్‌గా పదోన్నతిపై వెళ్లారు.

విద్యుత్ సరఫరాలో అంతరాయం

అలంపూర్: అలంపూర్ 132 కేవీ సబ్ స్టేషన్ పరిధిలో 33/11 కేవీ లైన్ మార్గంలో ఫీడర్లపై పడిన చెట్టు కొమ్మలు తొలగించడం, ఒరిగిన, నూతన విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేయనున్న నేపథ్యంలో విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఏడీఈ మహ్మద్ చిన్న మక్బుల్ ఓ ప్రకటనలో తెలిపారు. భీమవరం, అలంపూర్ చౌరస్తా, చాగాపురం, రామాపురం, పెద్ద తాండ్రపాడు గ్రామాల్లో గురువారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగనున్నట్లు తెలిపారు. వినియోగదారులు సహకరించగలరని విజ్ఞప్తి చేశారు.

బీమా చెక్కు అందజేత

మానవపాడు: మండలంలోని చెన్నిపాడు గ్రామానికి చెందిన మాల నాగరాజు కొన్ని నెలల క్రితం మరణించాడు. ఎస్‌బీఐలో పాలసీ చేశాడు. బుధవారం చెన్నిపాడులో పాలసీ హోల్డర్ కుటుంబానికి రూ.1.50 లక్షల చెక్కును ఎస్‌బీఐ కర్నూల్ డివిజన్ మేనేజర్ సుదీర్ మౌర్య అందజేశారు. బీమా సౌకర్యాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో బ్రాంచ్ మేనేజర్ వివేకానందరెడ్డి, లైఫ్‌మిత్ర ములికి, రాంమోహన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎంఆర్‌సీని సందర్శించిన సెక్టోరియల్ అధికారి



ధరూరు: మండల వనరుల కేంద్రాన్ని జిల్లా సెక్టోరియల్ అధికారి శాంతిరాజు సందర్శించారు. ఈ సందర్భంగా సీఆర్‌పీలు, ఎంఐఎస్ కోఆర్డినేటర్లు, సీసీఓ, ఐఈఆర్‌సీలతో ప్రత్యేక రివ్యూ మీటింగ్ నిర్వహించారు. ప్రధానంగా యూడైస్ ప్లస్, విద్యార్థుల హాజరుకు సంబంధించిన ఎఫ్ఆర్ఎస్ హాజరు శాతాన్ని పరిశీలించారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన గుర్తింపు నంబరు గల ఎషఆర్ఎస్ అటెండెన్స్, ఎస్ఎసీ నామినల్ రోల్స్ తదితర అంశాలపై రివ్యూ నిర్వహించారు. కార్యక్రమంలో అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

బాలల హక్కులు కాపాడాలి



కేటీదొడ్డి: బాలల హక్కులు కాపాడాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని జిల్లా మహిళ శిశు సంక్షేమ అధికారి సుధారాణి, ఎంవీఎఫ్ కోఆర్డినేటర్ రాజేంద్రప్రసాద్ అన్నారు. అంతర్జాతీయ బాలికల దినోత్సవ వేడుకలను ఎంవీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో బుధవారం మండలంలోని వెంకటాపురం ఆలయ ఆవరణలో ఘనంగా నిర్వహించారు. బాలికలలను ఉన్నత చదువులు చదివే విధంగా ప్రోత్సహించాలన్నారు. నిరక్షరాస్యతపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో డీసీపీఓ నర్సింహ, ఎంఈఓ వెంకటేశ్వర్‌రావు పాల్గొన్నారు.

అపరిచితులతో జాగ్రత్తగా ఉండాలి



అలంపూర్ రూరల్: అలంపూర్ మండల పరిధిలోని జిల్లెలపాడ్, సుల్తాన్‌పూర్ గ్రామలలో బుధవారం ఏఎస్ఐ బాషా పర్యటించారు. గ్రామ ప్రజలతో మాట్లాడుతూ.. అపరిచిత వ్యక్తులతో జాగ్రత్తగా మెలగాలన్నారు. దొంగతనాలు జరుగుతున్న నేపథ్యంలో అప్రమత్తంగా ఉండాలన్నారు. వ్యాపారాల పేరుతో గ్రామాల్లో పర్యటించిన వారి వివరాలు తెలుసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నిర్మించారు.. నిర్వహణ మరిచారు

- నిర్మాణం పూర్తయినా ఆటలకు నోచుకోని క్రీడా ప్రాంగణాలు
- పూర్తి స్థాయిలో వినియోగంలోకి తీసుకురావాలంటున్న ప్రజలు
- నిరుత్సాహంలో గ్రామీణ క్రీడాకారులు



చిన్నపోతలపాడులో నిరుపయోగంగా ఉన్న క్రీడా ప్రాంగణం

మానవపాడు: గత ప్రభుత్వం లక్షలు ఖర్చు చేసి ఏర్పాటు చేసిన క్రీడా ప్రాంగణాల నిర్మాణాలు పూర్తయినా వినియోగంలోకి తీసుకురాకపోవడంతో గ్రామీణ క్రీడాకారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గ్రామీణ క్రీడాకారులను ప్రోత్సహించి మట్టిలోని మాణిక్యాలను వెలికితీసే ఉద్దేశ్యంతో గత రాష్ట్ర ప్రభుత్వం ప్రతి గ్రామంలోనూ క్రీడా ప్రాంగణాలు సిద్ధం చేసింది. పట్టణాలకు తీసిపోని విధంగా పల్లెలను తీర్చిదిద్ది శాశ్వత వనరులను సమకూర్చింది. అలంపూర్ నియోజకవర్గంలోని 7 మండలాల్లోని 124 గ్రామ పంచాయతీలు ఉండగా.. దాదాపు ప్రతి గ్రామ పంచాయతీ ఆవరణలో ఓ క్రీడా ప్రాంగణం ఏర్పాటు చేశారు. నిర్వహణ లేక క్రీడాకారులు అవస్థలు పడుతున్నారు.

నిర్వహణ లోపం..

ప్రతి గ్రామ పంచాయతీలో క్రీడా ప్రాంగణాలు ఏర్పాటు చేసినా కొన్ని చోట్ల తప్పా క్రీడా ప్రాంగణాలు పూర్తి వినియోగంలోకి తీసుకురాలేదు. ప్రతి క్రీడా ప్రాంగణం చుట్టూ హరితహారం కింద మొక్కలు నాటాలి..? కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, బాస్కెట్‌బాల్ కోర్టులు ఏర్పాటు చేయాలి..? వ్యాయామానికి లాంగ్‌బార్ సింగిల్, డబుల్ స్తంభాలు ఏర్పాటు చేయాలని ప్రభుత్వ ఆదేశాలు ఉన్నా వాటిని నిర్మించలేదు. నియోజకవర్గంలో చాలా గ్రామాల్లో క్రీడా ప్రాంగణాలు పాఠశాల ఆవరణల్లో నిర్మించారు. దీంతో విద్యార్థులకు అసౌకర్యానికి గురౌతున్నారు. దీనికి తోడు క్రీడా ప్రాంగణాలు పూర్తి వినియోగంలో లేక క్రీడాకారులు నిరుత్సాహ పడుతున్నారు. ఉన్నతాధికారులు స్పందించి వినియోగంలోకి తీసుకురావాలని క్రీడాకారులు, ప్రజలు కోరుతున్నారు.

ఆటలు కూడా ఆడించడం లేదు..

నియోజకవర్గంలోని కొన్ని ప్రభుత్వ పాఠశాలల్లో క్రీడా ఉపాధ్యాయుడు ఉన్నా ఆటలు కూడా ఆడించడం లేదని విద్యార్థులు, వారి తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు. దీనికి తోడు ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాలు క్రీడా ప్రాంగణాలు కూడా లేకుండా నిర్వహణ సాగిస్తున్నాయి. క్రీడలతో మానసిక ఉల్లాసంతో పాటు శారీరక ధారుడ్యం పెంపొందిస్తాయని ప్రముఖులు చెబుతున్నా వాటిని పెడచెవిన పెడుతున్నారు. దీనిపై ఉన్నతాధికారులు స్పందించి గ్రామీణ క్రీడాకారులను ప్రోత్సహించడంపై చర్యలు తీసుకోవాలి.

ఉపాధ్యాయుడిని కేటాయించాలి..



ప్రభుత్వం గ్రామాల్లో ఏర్పాటు చేసిన క్రీడా ప్రాంగణాలు వినియోగంలోకి తీసుకురావాలి. గ్రామీణ ప్రాంతాల్లో సరైన మైదానలు లేక క్రీడాకారులు ఇబ్బందులు పడుతున్నారు. గ్రామీణ క్రీడాకారుల్లో విశేష ప్రతిభ దాగుంది. ప్రతి క్రీడా ప్రాంగణానికి ఓ క్రీడా ఉపాధ్యాయుడిని కేటాయించాలి. గ్రామాల్లో క్రీడాకారులకు శిక్షణ ఇచ్చేలా ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకోవాలి.

కిరణ్, చెన్నిపాడు

ఏళ్లుగా నిరీక్షణ..



గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం గ్రామీణ క్రీడాకారులను ప్రోత్సాహించాలని గ్రామాల్లో క్రీడా మైదానాలు ఏర్పాటు చేశారు. నేడు వాటి నిర్వహణ సరిగా లేక క్రీడా మైదానాలు నిరుపయోగంగా మారాయి. గ్రామీణ కళాకారులను ప్రోత్సహించాలి.. ఏళ్లతరబడి నిరీక్షిస్తున్నా క్రీడాకారులకు ప్రోత్సాహం అందడం లేదు. ఉన్నతాధికారులు చొరవ చూపి గ్రామీణ క్రీడాకారులకు ఉపయోగపడే విధంగా చర్యలు తీసుకోవాలి.

సంజీవనాయుడు, గోకులపాడు

పోటీ పరీక్షలతో జ్ఞాపకశక్తి మెరుగు

అలంపూర్: పోటీ పరీక్షలతో విద్యార్థుల జ్ఞాపకశక్తి మెరుగవుతుందని మండల విద్యాశాఖ అధికారి అశోక్ కుమార్ అన్నారు. అలంపూర్ పట్టణంలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో ప్రజానాట్య మండలి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న బాలోత్సవం కార్యక్రమం బుధవారం కొనసాగింది. జూనియర్స్ విభాగంలో 6, 7, 8వ తరగతి విద్యార్థులకు వ్యాస రచన పోటీలు నిర్వహించారు. వాహనదారులు-రోడ్డు ప్రమాదాల నివారణ అనే అంశాన్ని కేటాయించారు. సీనియర్స్ విభాగంలో 9, 10వ తరగతి విద్యార్థులకు లైంగిక వేధింపులు, మహిళల భద్రత అనే అంశాన్ని కేటాయించారు. వ్యాసరచన పోటీల్లో 68 మంది విద్యార్థులు హాజరయ్యారు. 21వ తేదీ గురువారం విద్యార్థులకు ఉపన్యాస పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో జీహెచ్‌ఎం శ్రీనివాసులు, ఉపాధ్యాయులు నాగలక్ష్మి, సుశీలమ్మ, లోకేశ్వరమ్మ, సుశీలమ్మ, పార్వతమ్మ, శ్రీనివాసులు, వెంకటరమణ, బీ. మద్దిలేటి, ఈదన్న, మద్దిలేటి, గుప్తా, నాగరాజు, లక్ష్మీకాంత్, రాజేష్, ప్రజానాట్యమండలి జిల్లా అధ్యక్షుడు అలీ అక్బర్, కార్యదర్శి ఆశన్న, కళాకారులు అయ్యప్ప, నరసింహ తదితరులు పాల్గొన్నారు.


వ్యాసరచన పోటీలు పరిశీలిస్తున్న ఎంఈఓ అశోక్ కుమార్

వేర్వేరు ప్రమాదాల్లో పలువురికి గాయాలు

ఉండవెల్లి: మండలంలోని జాతీయ రహదారిపై హైదరాబాద్ నుంచి ప్రొద్దుటూరుకు లోడ్‌తో వెళ్తున్న లారీ ఒక్కసారిగా బోల్తా పడింది. ప్రమాదంలో లారీ డ్రైవర్ కడెం పుల్లయ్యకు తీవ్రగాయాలైనట్లు స్థానికులు తెలిపారు. డ్రైవర్‌కు ఒక్కసారిగా కాలు, చేయి పనిచేయకపోవడంతో ప్రమాదం జరిగింది. క్షతగాత్రుడిని కర్నూల్ ఆసుపత్రికి తరలించారు.

మల్దకల్ : మండలంలోని అమరవాయి గ్రామ సమీపంలో మంగళవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో పలువురు తీవ్రంగా గాయపడ్డారు. వివరాలు. అమరవాయి గ్రామ సమీపంలో బీటీ రోడ్డుకు చేస్తున్న మరమ్మత్తుల వద్ద ఎలాంటి సూచిక బోర్డులు లేకపోవడంతో వేగంతో వస్తున్న వాహనదారులు అదుపుతప్పి ప్రమాదాలకు గురవుతున్నారు. నీలిపల్లి గ్రామానికి చెందిన రత్నం అదే గ్రామానికి చెందిన పాస్టర్‌తో బైక్‌పై స్వగ్రామానికి వెళ్తుండగా అమరవాయి వద్ద బైక్ అదుపుతప్పి కిందపడటంతో పాస్టర్‌కు తీవ్ర గాయాలు కాగా రత్నం స్వల్ప గాయాలతో బయటపడ్డాడు. అదే విధంగా అయిజ , గట్టుకు చెందిన వాహనదారులు రోడ్డు మరమ్మత్తుల వద్ద బైక్‌లు అదుపుతప్పి కిందపడటంతో తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రులను గద్వాల ఆస్పత్రికి తరలించారు.


జాతీయ రహదారిపై బోల్తా పడిన లారీ

మెనూ ప్రకారం భోజనం అందించాలి

మల్దకల్: విద్యార్థులకు మెనూ ప్రకారం మధ్యాహ్న భోజనం అందించాలని ఇన్‌చార్జి ఎంఈఓ సురేష్ ఉపాధ్యాయులు, వంట ఏజెన్సీ మహిళలకు సూచించారు. బుధవారం మండలంలోని తాటికుంట, మల్దకల్ ప్రాథమిక పాఠశాలలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. అనంతరం రికార్డులు పరిశీలించారు. గ్రామాల్లో బడి బయట ఉన్న పిల్లలందరిని బడిలో చేర్పించాలన్నారు. కార్యక్రమంలో సీఆర్పీలు తదితరులు పాల్గొన్నారు.


మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న ఇన్‌చార్జి ఎంఈఓ సురేష్

‘ఉపాధి’ పనుల్లో అక్రమాలు


మానవపాడులో మాట్లాడుతున్న పీడీ నరసింగరావు

36 మందికి షోకాజ్ నోటీసులు

మానవపాడు: ఉపాధి హామీ పనులపై వారం రోజులుగా గ్రామాల్లో సామాజిక తనిఖీలు చేపట్టగా.. అక్రమాలు చోటుచేసున్నాయని సామాజిక తనిఖీ విభాగం సిబ్బంది తేల్చారు. ఈమేరకు మానవపాడులో బుధవారం పీడీ నరసింగరావు ఆధ్వర్యంలో ఉపాధిహామీ సామాజిక తనిఖీ ప్రజావేదిక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈజీఎస్ పనులకు సంబంధించి మండలంలో మొత్తం రూ.3.12 కోట్ల పనులు చేయగా.. దీనిలో సుమారు రూ.1.27 లక్షలు అవకతవకలు జరిగిందని గుర్తించామన్నారు. త్వరలో ఈ నగదు రికవరీ చేయాలని అధికారులను ఆదేశించారు. మండలంలోని 16 మంది గ్రామ పంచాయతీ సెక్రటరీలకు, నలుగురు టెక్నికల్ అసిస్టెంట్లకు, 16మంది ఫీల్డ్ అసిస్టెంట్లకు షోకాజ్ నోటీస్‌లు జారీ చేశారు. ఈమేరకు సిబ్బంది అందరూ రెండు రోజుల్లో వివరణ ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో ఏపీడి శ్రీనివాసులు, ఎంపీడీఓ భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

అర్హులు సద్వినియోగం చేసుకోవాలి



అయిజ: కేంద్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన విశ్వకర్మ పథకాన్ని అర్హులైన వారందరూ సద్వినియోగం చేసుకోవాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు రామచంద్రారెడ్డి కోరారు. బుధవారం పట్టణంలో విశ్వకర్మ యోజనపై ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో బీజేపీ పట్టణ ప్రధాన కార్యదర్శి భగత్ రెడ్డి, ఉపాధ్యక్షుడు లక్ష్మణ్ గౌడ్, బూత్ అధ్యక్షుడు శేఖర్, వినయ్, బస్వరాజ్, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

రక్తదాన శిబిరం ఏర్పాటు

ఎర్రవల్లి: మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు వెంకటేష్ యాదవ్ ఆధ్వర్యంలో బుధవారం మాజీ ఎమ్మెల్యే, ఏఐసీసీ కార్యదర్శి సంపత్ కుమార్ జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. అదేవిదంగా అలంపూర్ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు జోగుల రవి ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో రుక్మాందర్ రెడ్డి, రాజ్‌కుమార్, ఆదాం, ఉమాపతి నాయుడు, రాంచంద్రరెడ్డి, ఖాజ, అల్లబకాష్, ఉశేన్ , కాంతన్న, సంధ్యబాబు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా జన్మదిన వేడుకలు..

అయిజ: మండల కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో బుధవారం ఏఐసీసీ కార్యదర్శి సంపత్‌కుమార్ పుట్టిన రోజు వేడుకలు కాంగ్రెస్ నాయకులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్ కట్‌చేసి స్వీట్లు పంచిపెట్టారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు ఆర్.శ్రీధర్, మధుకుమార్, కృష్ణారెడ్డి, దేవరాజు, మద్దిలేటి తదితరులు పాల్గొన్నారు.

కలుగోట్ల వాసికి డాక్టరేట్



ఉండవల్లి: మండలంలోని కలుగోట్ల గ్రామానికి చెందిన సోమశేఖర్ ఈ నెల 18న చెన్నైలో డీమ్డ్ యూనివర్సిటీ పరిధిలోని సవిత ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ అండ్ టెక్నికల్ సైన్సెస్ కళాశాలలో 23వ స్నాతకోత్సవ వేడుకల్లో డాక్టరేట్ ప్రదానం చేసినట్లు తెలిపారు. ఛాన్సలర్ వీరయన్ చేతుల మీదుగా డాక్టరేట్ సాధించి ఇంజినీరింగ్‌లో క్వాడ్రేచర్ పనితీరు పరిశోధనలో 5జీలో యాంప్లిట్యూడ్ మాడ్యులేషన్ క్యూసీ-ఎల్‌డీపీసీ కోడింగ్‌లో భాగంగా మెరుగైన మొబైల్ బ్యాడ్ బ్యాండ్ కోసం సిస్టమ్స్ కమ్యూనికేషన్‌లో డాక్టరేట్ చేశారు. ప్రస్తుతం సోమశేఖర్ హైదరాబాద్‌లోని విశ్వేశ్వరయ్య ఇంజినీరింగ్ కళాశాలలో విధులు నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా పలువురు హర్షం వ్యక్తం చేశారు.

ఘనంగా భవానీమాత జాతర


రథం వద్ద ఎమ్మెల్యే కృష్ణమోహన్‌రెడ్డి తదితరులు


అమ్మవారి కలశాల ఊరేగింపు

గట్టు : మండల కేంద్రంలో నిర్వహిస్తున్న శ్రీఅంబా భవానీ మాత జాతర సందర్భంగా రెండో రోజైన బుధవారం ఆలయంలో అమ్మవారికి ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఉదయం 11 గంటలకు చౌడమ్మ దేవాలయం నుంచి అమ్మవారి కలశాలను ఎస్ఎస్‌కే సమాజ్ వారు ఊరేగింపుగా సంత బజారులోని భవానీ మాతా ఆలయానికి తీసుకొచ్చారు. అనంతరం అమ్మవారిని వెండి ఆభరణాలతో అలంకరించి పూజలు నిర్వహించారు. గట్టు గ్రామస్తులు పిండి వంటలతో అమ్మవారికి నైవేద్యాలు సమర్పించారు. కొందరు భక్తులు కుంభం కాగులతో అమ్మవారితో పాటుగా పెద్దమ్మవ్వ, గొకరమయ్యకు చేరుకుని ప్రత్యేక పూజలు చేశారు. జాతర సందర్భంగా గ్రామ సరిహద్దుల్లో వెలసిన దేవతలకు నైవేద్యాలు సమర్పించారు.

భక్తులకు అన్నదానం.....

రథోత్సవాన్ని పురస్కరించుకుని భవాని ఆలయం వద్ద భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కర్నూలు జిల్లా కోడుమూరుకు చెందిన బసోది వెంకటేశ్వర్లు కుటుంబ సభ్యులు భక్తులకు అన్నదానం నిర్వహించారు. ప్రతి ఏటా జాతర సందర్భంగా భక్తులకు అన్నదానం చేయడం ఆనవాయితీగా వస్తోంది.

వైభవంగా ప్రభోత్సవం..

జాతర సందర్భంగా మంగళవారం రాత్రి ప్రభోత్సవం వైభవంగా నిర్వహించారు. చిన్న రథాన్ని ప్రత్యేకంగా అలంకరించారు. అమ్మవారు ఆశీనులైన చిన్న రథాన్ని ఆలయం నుంచి ఊర చావిడి దగ్గరున్న శ్రీలక్ష్మీవెంకటేశ్వరస్వామి దేవాలయం వరకు సాగింది. కార్యక్రమంలో ఎస్ఎస్‌కే సమాజ్ అధ్యక్షుడు పెద్ద అంబుసా, సంఘం సభ్యులు పాపురం వెంకటేష్, ఈరన్న, చంద్రమోహన్, వినోద్ తదితరులు పాల్గొన్నారు.

సాంస్కృతిక కార్యక్రమాలు..

గట్టులోని భవాని మాత జాతర సందర్భంగా గురువారం నుంచి మూడు రోజుల పాటు వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు కాంగ్రెస్ నాయకులు రామకృష్ణారెడ్డి, మోహన్‌గౌడ్‌ల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ నెల 21 గురువారం రాత్రి గ్రామ పంచాయతీ ఆవరణలో హైదరాబాద్‌కు చెందిన అజీమ్ మాస్టర్ ఆధ్వర్యంలో డ్యాన్స్ ప్రోగ్రాం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రముఖ మిమిక్రి కళాకారుడు హరిప్రసాద్ చేత మిమిక్రి నిర్వహిస్తున్నట్లు తెలిపారు. బుధవారం రాత్రి ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి ప్రత్యేక పూజలు చేశారు.

వ్యసనాలకు దూరంగా ఉండాలి

శాంతినగర్: జీవితంలో ఉన్నత శిఖరాలకు చేరుకోవాలంటే వ్యసనాలకు దూరంగా ఉండాలని సీఐ టాటాబాబు విద్యార్థులకు సూచించారు. అంతర్జాతీయ బాలల దినోత్సవం సందర్భంగా ఎంవీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం నిర్వహించిన ప్రత్యేక సమావేశంలో ఆయన పాల్గొన్నారు. విద్యార్థులకు పలు అంశాలపై అవగాహన కల్పించారు. బాల్య వివాహాల వల్ల జరిగే నష్టాలు, సోషల్ మీడియా, చట్టాలు, మొబైల్ వాడకం గురించి వివరిస్తూ వ్యసనాలకు దూరంగా ఉండాలని సూచించారు. మున్సిపల్ కమిషనర్ రాజయ్య మాట్లాడుతూ.. భవిష్యత్ ప్రణాళిక ఏర్పాటు చేసుకుని విద్యార్థులు చదువులు కొనసాగించాలని సూచించారు. ఎంఈఓ నరసింహ మాట్లాడుతూ.. ఉపాధ్యాయులు చెప్పిన పాఠ్యాంశాలను శ్రద్ధగా అవగాహన చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో జీహెచ్‌ఎం వెంకటేశ్వరరావు, ఎంవీ ఫౌండేషన్ మండల కోఆర్డినేటర్ హనిమిరెడ్డి, సీఆర్‌పీఎఫ్ సభ్యులు నర్సింహులు, సుధాకర్, విశ్రాంత ప్రధానోపాధ్యాయుడు రామ్మోహన్, ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న సీఐ టాటాబాబు

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం

మల్దకల్: మండలంలోని అమరవాయి గ్రామానికి చెందిన బుడ్డమ్మ (60) అనారోగ్యంతో బుధవారం మృతి చెందారు. ఈ సందర్భంగా మాల మహానాడు సంఘ నాయకులు పూజారి పెద్ద నల్లన్న, తిమ్మప్ప, ఆంజనేయులు, రామక్రిష్ణ వారి భౌతికదేహానికి నివాళులర్పించారు. అనంతరం మృతురాలి కుమారుడు హన్మంతుకు ఆర్థిక సహాయం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. బాధిత కుటుంబానికి మాల మహానాడు సంఘం ఎల్లప్పుడూ అండగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో తిమ్మన్న, నాగన్న, జయరాం, పాండు రంగస్వామి, ప్రభాకర్, వెంకట్రాములు, వెంకటస్వామి, వెంకటేష్, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.


ఆర్థిక సాయం అందజేస్తున్న మాల మహానాడు సంఘం నాయకులు

సర్వేలో నిబంధనలు పాటించాలి


అలంపూర్‌లో..

అయిజ: ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన కుల గణన సర్వేలో కురువ కులానికి ముందు మాదాసి కురవ, మాదారి కురువగా నమోదు చేసుకోవాలని కురవ సంఘం నాయకులు కోరారు. బుధవారం తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ జ్యోతికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ నాయకుడు సంకాపురం రాముడు మాట్లాడుతూ.. సర్వేలో కుటుంబ యజమాని చెప్పిన కులం నమోదు చేయకుండా కులమార్పిడికి పాల్పడడం అన్యాయమన్నారు. ఏ ఇతర కులాలకు లేని ఆటంకాలు మాదాసి కురువ, మాదారి కురువలకు ఆపాదించడం సరికాదన్నారు. కార్యక్రమంలో కృష్ణ, గోవిందు, సురేష్, నర్సన్న, నాగన్న, తిరుమలేష్, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

చివరి దశకు సమగ్ర సర్వే..

అలంపూర రూరల్: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన కుటుంబ సమగ్ర సర్వే చివరి దశకు చేరుకుందని ప్రత్యేక అధికారి భాగ్యలక్ష్మీ అన్నారు. అలంపూర్ పట్టణంలోని ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీడీఓ పద్మావతితో కలిసి బుధవారం 14 గ్రామలకు సంబంధించిన సూపర్‌వైజర్లతో సమావేశం నిర్వహించారు. ఏ కుటుంబాన్ని వదలకుండా ప్రతి ఒక్కరి వివరాలు నమోదు చేయాలన్నారు. తెలిపారు. లింగస్వాయి గ్రామంలో జరుగుచున్న సర్వేను పరిశీలించారు. కార్యక్రమంలో అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

గడువులోగా సమగ్ర కుటుంబ సర్వే పూర్తి

మల్దకల్: ప్రభుత్వం నిర్దేశించిన గడువులోగా సమగ్ర కుటుంబ సర్వేను పూర్తి చేయాలని జెడ్పీ సీఈఓ కాంతమ్మ సూచించారు. బుధవారం మండలంలోని మద్దెలబండలో నిర్వహిస్తున్న సమగ్ర కుటుంబ సర్వేను ఆమె పరిశీలించారు. ఎంపీడీఓ కార్యాలయంలో సూపర్‌వైజర్లతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఆయా గ్రామాల్లో ఎన్యుమరేటర్లు నిర్వహించే సర్వేను పరిశీలించడంతో పాటు సర్వే పూర్తయిన వెంటనే కంప్యూటర్లలో ఆన్‌లైన్ చేసే కార్యక్రమాన్ని కొనసాగించనున్నట్లు ఆమె తెలిపారు. ఎన్యుమరేటర్లు సర్వేలో ఎలాంటి తప్పులు లేకుండా వివరాలు నమోదు చేయాలన్నారు.

ప్రజా పాలనపై కళాజాతా

ధరూరు: కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది పూర్తయిన సందర్భంగా ప్రజా పాలన-ప్రజా విజయోత్సవాలను పురస్కరించుకుని జిల్లాలో నిర్వహిస్తున్న కళాజాతా యాత్రను విజయవంతం చేయాలని డిప్యూటీ తహసీల్దార్ మంగమ్మ అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం వద్దకు చేరుకున్న ప్రజా పాలన యాత్ర ప్రత్యేక ప్రచార వాహన కళాజాతా బృందం ప్రభుత్వం చేపట్టిన పలు అభివృద్ధి పథకాలను పల్లె సుద్దులు, పాటల రూపంలో వివరించారు. మహాలక్ష్మీ, మహిళా శక్తి, గృహజ్యోతి, రైతు రుణమాఫీ, ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలపై ప్రచారం చేశారు. 10 ఏళ్ల బీఆర్ఎస్ పాలనలో జరగని అభివృద్ధి కాంగ్రెస్ వచ్చిన ఏడాదిలోనే పూర్తి చేస్తోందన్నారు.

ప్రజలకు అందుబాటులో ఉండాలి

కేటీదొడ్డి: కామన్ సర్వీస్ సెంటర్ (సీఎస్‌సీ) నిర్వాహకులు ప్రజలకు అందుబాటులో ఉండి సేవలు అందించాలని జోగుళాంబ గద్వాల జిల్లా సీఎస్‌సీ కోఆర్డినేటర్ శ్రీకాంత్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని నందిన్నె, గువ్వలదిన్నె, చింతలకుంట తదితర గ్రామాల్లోని సీఎస్‌సీ కేంద్రాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న సంక్షేమ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. పథకాలు ప్రతి ఒక్కరూ వినియోగించుకునేలా చూడాలన్నారు. కార్యక్రమంలో సీఎస్‌సీ జిల్లా మేనేజన్ శేఖర్, కామన్ సర్వీస్ సెంటర్ యాజమానులు రవిబాబు, మౌళాలి తదితరులు పాల్గొన్నారు.